పత్రికా ప్రకటన                                                                    కాకినాడ, సెప్టెంబర్ 4, 2021.

టీయూ-142ఎం విమాన మ్యూజియం ఏర్పాటు పనులను త్వరితగతిన పూర్తిచేసేందుకు కృషిచేస్తున్న జిల్లా అధికార యంత్రాంగానికి అభినందనలు తెలియజేస్తున్నానని, మ్యూజియం ప్రారంభోత్సవం కోసం ఎదురుచూస్తున్నట్లు తూర్పు నౌకాదళ అధిపతి వైస్ అడ్మిరల్ అజేంద్ర బహదూర్ సింగ్ పేర్కొన్నారు. కాకినాడ బీచ్ పార్క్ వద్ద కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) ఆధ్వర్యంలో రూ.5.89 కోట్ల అంచనా వ్యయంతో ఏర్పాటుచేస్తున్న టీయూ-142ఎం విమాన మ్యూజియం పనులను జిల్లా కలెక్టర్ చేవూరి హరికిరణ్, కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, కుడా ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, కుడా వైస్ ఛైర్మన్ కె.సుబ్బారావు తదితరులతో కలిసి వైస్ అడ్మిరల్ అజేంద్ర బహదూర్ సింగ్ పరిశీలించారు. తొలుత మ్యూజియం వద్ద కలెక్టర్ హరికిరణ్.. వైస్ అడ్మిరల్ అజేంద్ర బహదూర్ సింగ్‌కు ఆహ్వానంపలికారు. అనంతరం ప్రాంగణంలోని సమావేశ మందిరంలో మ్యూజియానికి సంబంధించి పూర్తయిన, ఇంకా మిగిలియున్న పనులను కుడా వైస్ ఛైర్మన్ కె.సుబ్బారావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వైస్ అడ్మిరల్‌కు వివరించారు. ఈ సమావేశం అనంతరం తూర్పు నౌకాదళాధిపతి మాట్లాడుతూ మ్యూజియం ఏర్పాటు పనుల్లో పురోగతిని సమీక్షించేందుకు కాకినాడ వచ్చానని.. కుడా ఆధ్వర్యంలో జరుగుతున్న పనులు పూర్తిస్థాయిలో పూర్తయిన అనంతరం మ్యూజియాన్ని ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని తెలిపారు.

*60-90 రోజుల్లో పనుల పూర్తి: కలెక్టర్ చేవూరి హరికిరణ్*

టీయూ-142ఎం విమాన మ్యూజియానికి సంబంధించి మిగిలియున్న పనులను 60-90 రోజుల్లో పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ చేవూరి హరికిరణ్ తెలిపారు. ఆహ్లాదకర వాతావరణంలో ఏర్పాటవుతున్న మ్యూజియం పనులను త్వరితగతిన పూర్తిచేసి గౌరవ ముఖ్యమంత్రితో ప్రారంభోత్సవం చేయించేందుకు సన్నాహకాలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇలాంటి మ్యూజియంలు ఇప్పటికే కోల్‌కతా, విశాఖపట్నంలో ఏర్పాటయ్యాయని మూడో మ్యూజియాన్ని కాకినాడలో ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. తమిళనాడులో విమానాన్ని విడగొట్టి అక్కడి నుంచి కాకినాడకు తీసుకొచ్చి విడిభాగాలను తిరిగి అమర్చే పనులు పూర్తయ్యాయన్నారు. ఇంకా విమానం లోపల కొన్ని పనులు మిగిలి ఉన్నాయని, ప్రజల సందర్శనకు అనువుగా ఉండేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. ఈ పనులను తనేజా ఏరోస్పేస్ అండ్ ఏవియేషన్ లిమిటెడ్ సంస్థ చూస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా ఏపీ టూరిజం విభాగం స్నాక్స్ బార్, ఇంటర్‌ప్రెటేషన్ సెంటర్ తదితరాలతో పాటు పచ్చదనాన్ని దాదాపు కోటిన్నర రూపాయలతో అభివృద్ధి చేస్తోందని, ఈ పనులు కూడా త్వరలో పూర్తికానున్నట్లు తెలిపారు. కాకినాడ బీచ్ పరిసరాల్లో పర్యాటక రంగానికి మకుటంగా నిలవనున్న విమాన మ్యూజియాన్ని వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చేస్తున్న ప్రయత్నంలో భాగంగా కాకినాడ పర్యటనకు విచ్చేసిన వైస్ అడ్మిరల్ అజేంద్ర బహదూర్ సింగ్‌కు రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం తరఫున ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు కలెక్టర్ హరికిరణ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కాకినాడ ఆర్‌డీవో ఏజీ చిన్నికృష్ణ, తనేజా ఏరోస్పేస్ అండ్ ఏవియేషన్ లిమిటెడ్ ప్రతినిధి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

(సమాచార శాఖ జారీ)